www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 10 మే 2025



అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి-పీలేరు

ఈనెల 11న పౌర్ణమి సందర్భంగా అరుణాచలం వెళ్లే భక్తుల కోసం పీలేరు ఆర్‌టిసి డిపో నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ నిర్మల పేర్కొన్నారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం మధ్యాహ్నం పీలేరు నుంచి 2 గంటలకు బయలుదేరే ఎక్స్‌ప్రెస్ బస్సు టికెట్ల బుకింగ్ ప్రారంభించామన్నారు. టికెట్ ధర రూ.700 మాత్రమేనని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా సీట్లు రిజర్వు చేసుకోవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు బస్ స్టేషన్ మేనేజర్ 9441774743కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చని తెలియజేశారు. ఈ అవకాశాన్ని పీలేరుతో పాటు పరిసర ప్రాంతాల యాత్రికులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని, ఆర్‌టిసిని ఆదరించాలని కోరారు.




మాట్లాడుతున్న డిపో మేనేజర్ నిర్మల

'ఉపాధి' సిబ్బంది ఆకలి కేకలు!



రూ.126 కోట్ల మెటీరియల్ కాంపొండ్ కోసం నిరీక్షణ
గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు గ్రహణం
కేంద్ర, రాష్ట్రాల ఉదాసీనతపై ఆందోళన

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



ఉపాధి హామీ చట్టం కింద పనిచేసే సిబ్బంది ఆకలికేకలతో అలమటిస్తున్నారు. కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలోని 66 మండలాల పరిధిలో వేలాది మంది ఉద్యోగులు ఐదు నెలలుగా వేతన యాతన అనుభవిస్తున్నారు. వీరందరూ చిన్నపాటి జీతాలతో ఉపాధి హామీ చట్టాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. ఇటువంటి చిరుద్యోగులకు సకాలంలో జీతాలు విడుదల చేయడంలో కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఉపాధి అమలు కారణంగా నిరుద్యోగ సమస్య ఉధృతి తగ్గుదల, ప్రజల కొనుగోలు శక్తి పెరుగుదలల్లో కీలకపాత్ర పోషిస్తోంది. ఇటువంటి ఉపాధి హామీ ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడడం ఆందోళన కలిగిస్తోంది. మొన్నటి వరకు లేబర్ కాంపొండ్ నిధుల విడుదలలో తాత్సారం, తాజాగా మెటీరియల్ కాంపొండ్ నిధుల విడుదలలో జాప్యం చేయడం కలవరాన్ని కలిగిస్తోంది.

జిల్లాలో ఉపాధి హామీ పథకం ఉద్యోగుల్లో నిర్వేదం నెలకొంది. కొన్నేళ్లుగా ఉపాధి హామీ చట్టం అమలులో జిల్లా ముందంజలో నిలుస్తోంది. ఉపాధి హామీ చట్టం అమలులో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న ఎపిఒ, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇతర స్టాఫ్ సిబ్బంది వివిధ కేటగిరీల కింద 2 వేల మంది ఉద్యోగులకు జీతాలు నిలిపేయడం ఆందోళన కలిగిస్తోంది. ఉపాధి హామీ చట్టరూపం దాల్చడం ద్వారా దేశంలో నిరుద్యోగం పెచ్చరిల్లకుండా చేస్తోంది. దీంతోపాటు ప్రజల్లో కొనుగోలుశక్తి పెరుగుదలలో కీలకపాత్ర పోషిస్తోంది. ఇంతటి బృహత్తర ప్రగతిలో పాలు పంచుకున్న చిరుద్యోగుల పట్ల చిన్నచూపు చూడడం ఆందోళన కలిగిస్తోంది.

5 నెలలుగా ... నిరీక్షణ

2024 డిసెంబర్ నుంచి మే రెండో వారం వరకు ఉద్యోగులకు జీతాలు విడుదల చేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈలెక్కన మెటీరియల్ కాంపొండ్ నిధుల కింద విడుదల చేయాల్సిన సుమారు రూ.100 కోట్లలో ఐదు నుంచి 10 శాతం మేర ఉద్యోగులకు జీతాలు చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది.

ఇందులో కడప జిల్లాకు రూ.70 కోట్లు, అన్నమయ్య జిల్లాకు రూ.56 కోట్లు మేరకు మెటీరియల్ కాంపొండ్ నిధుల విడుదల చేయాల్సి ఉంది. ఇందులో నుంచి ఉపాధి హామీ ఉద్యోగులకు జీతాలు, ఇతర గ్రామీణాభివృద్ధి పనులు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఉమ్మడి జిల్లాల్లో ఉపాధి హామీ ఉద్యోగులకు కనిష్టంగా రూ.15 వేల నుంచి గరిష్టంగా రూ. 50 వేలతో కూడిన చిరుద్యోగుల జీతాలు నిలిపి వేయడం ఆందోళన కలిగిస్తోంది. 2006 నుంచి ఉపాధి హామీ పథకం అమలు చరిత్రలో ఎన్నడూ ఇటువంటి ఉదాసీనత చోటుచేసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గ్రామీణాభివృద్ధిపై ప్రభావం

కడప జిల్లాలోని 553 పంచాయతీల్లో ఉపాధి హామీ చట్టం నిధులతో అభివృద్ధి పరుగులు తీస్తోంది. ప్రతిఏటా ఉమ్మడి జిల్లాలో రూ.126 కోట్లతో సిమెంట్‌రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి తొట్లు, ఇతర విభాగాలకు చెందిన భవన నిర్మాణాలు, రహదారుల పనులు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఎస్‌సి, ఎస్‌టి జనాభా కలిగిన ప్రాంతాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీనత కారణంగా నాలుగు నెలల కిందటి వరకు లేబర్ కాంపొండ్ నిధుల విడుదలలో జాప్యం కారణంగా ఉపాధి హామీ కార్మికులకు కూలి పడని పరిస్థితి. దీంతోపాటు 2024 డిసెంబర్ 15 నుంచి మెటీరియల్ కాంపొండ్ నిధుల విడుదలలో అంతులేని నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది ఉద్యోగులకు వేతన యాతన తప్పడం లేదు. ఫలితంగా ఉపాధి హామీ పథకం అమలును ప్రశ్నార్థకం చేస్తోంది.



ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మజ్జిగ పాకెట్స్‌ను పంచుతున్న మానవత సభ్యులు

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే పభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరుగా వార్డులోకి చేరుకుని చికిత్స పొందుతున్న రోగులను కలుసుకుని అందుతున్న వైద్యసేవలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. రామారావు కాలనీకి చెందిన ఓ మహిళ కడుపునొప్పి బాధ తట్టుకోలేక విషం తాగి ఆస్పత్రిలో చేరి ఐసియూలో చికిత్స పొందుతున్న ఆమెను పరామర్శించారు. మెరుగైన చికిత్సలు అందిం చాల ని వైద్యులను ఆదేశించారు. ఆ మహిళతో మాట్లాడి ధైర్యంగా ఉండాలన్నారు. ఇంటి స్థలం కేటాయి స్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వైద్య సదు పాయాలు మెరుగ్గా అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నెలకు రూ.30 లక్షల మందులు ఆస్పత్రికి వస్తున్నాయని, అన్ని రకాల జబ్బులకు ఇక్కడే వైద్య చికిత్సలు అందేవిధంగా వైద్యులను నియమిస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకుని ఇక్కడే చికిత్సలు పొందవ చ్చని అన్నారు. వైద్యులు సైతం రెఫరల్స్ ను పూర్తిగా నియంత్రిచాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట వైద్యులు, వైద్య బృందం, టిడిపి నాయకులు ఉన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలివాలని అమానత్ సేవా సొసైటీ వ్యవస్థాపకుడు షేక్ అతావుల్లా అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి బి పాజిటివ్ రక్తం అవసరం అవ్వడంతో బంధువులు ఆయనకు సంప్రదించడంతో వెంటనే స్పందించి షేక్ కాలేషా అనే యువకుడి చేత శ్రీ దీప బ్లడ్ బ్యాంక్‌లో బి పాజిటివ్ రక్తదానం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తం అనేది ప్రాణానికి చాలా అవసరమని రక్తదానం చేయడం ద్వారా ప్రాణాన్ని కాపాడే వ్యక్తులమవుతామన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనం తరం కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హిబా బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మయానా మొహమ్మద్ అలీపఠాన్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది నరేష్, ఐఫ్యాషన్ అధినేత ముజాహిద్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

ప్రజాశక్తి-పీలేరు : గర్భిణులు సకాలంలో ఆరోగ్య సేవలు, నాణ్యమైన పౌష్టిక ఆహారం తీసుకున్నప్పుడే సురక్షిత మాతృత్వం సాధ్యమని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి తెలిపారు. పిఎంఎస్‌ఎంఎ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఆరోగ్య పరిక్షలు, చికిత్స అందించారు. గర్భిణీ కాలంలో కనీసం నాలుగు సార్లు వైద్యనిపుణులచే పొందే ఆరోగ్య పరీక్షల ఫలితంగా రక్తహీనత, బిపి, మధుమేహం, మొదలగు ఆరోగ్య సమస్యలు తెలుసుకుని, గర్భిణి స్త్రీలకు డాక్టర్ తగు సూచనలు, మందులు ఇచ్చారు. స్థానిక ఎయిడ్స్ నియంత్రణ విభాగంలో పనిచేస్తున్న రాజమ్మ సహాయ, సహకారంతో 27మంది గర్భిణులు పండ్లు, పాలు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, ఎఎన్‌ఎంలు నాగవేణి, కృష్ణమ్మ, ల్యాబ్ టెక్నిషియన్, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మదనపల్లి ప్రధాన శాఖ గ్రంధాలయం వేసవి శిక్షణ శిబిరం ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుగుతున్నట్లు గ్రంథాలయ అధికారిణి ఆర్.వసంత కుమారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వవిద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలన్న ఉద్దేశంతోఈ శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే పలు అంశాలపై తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు మదన్ మానవతా విలువలు, మాథ్స్, రెడ్డెప్ప స్పోకెన్ ఇంగ్లీష్‌లో మెలకువలు నేర్పిస్తున్నట్లు తెలిపారు. పోర్డ్ సంస్థ నుంచి నరసింహులు, ఈవ్ టీజింగ్, తల్లి దండ్రులను గౌరవించడంపై పాటల రూపంలో అవగాహన కల్పించడం విద్యార్థులను ఎంతగానో ఆకట్టు కుందన్నారు. ఇలా ప్రతిరోజు వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

మానవత సంస్థ సేవలు విస్తృతం

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లెలో మానవత సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరువ చేయను న్నట్లు మానవత సంస్థ అధ్యక్షుడు భాస్కరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే ఉచిత శాంతి రథం ప్రజలకు అందుబాటులో ఉందని చెప్పారు. బాడీ ఫ్రీజర్ బాక్స్‌లను కూడా ఉచితంగా ప్రజలకు అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యారంగంలో భాగంగా పాఠశాలల్లో కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహించడంతోపాటు, పిల్లలకు నైతిక విలువలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో దాతల సహకారంతో మొత్తం 36 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో మానవత సంస్థ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు ప్రజల సలహాలు, సూచనలు తీసుకుంటూ ముందుకు సాగుతామని అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల వద్ద మానవత సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, ఉపా ధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, సభ్యులు శంకరప్పనాయుడు, వీరంరెడ్డి, నరసింహులు, లక్ష్మీనారాయణ, నాగ రాజు, కుమారస్వామి, వెంకటశివ, మిలట్రీ రమణారెడ్డి పాల్గొన్నారు.

తలసేమియా బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వంశ పారంపర్యంగా సంక్రమించే తలసేమియా వ్యాధితో బాధపడే బాధితులను ఆదుకోవాలని వెలుగు సంస్థ ఇసి మెంబర్ సుజాత తెలిపారు. శుక్రవారం పట్టణంలోని అమ్మ చెరువుమిట్ట వద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో ప్రపంచ తలసేమియాడే నిర్వహించారు. స్పెషల్ ఎడ్యుకేటర్ విజయకుమారి మాట్లాడుతూ తలసేమియా వ్యాధి లక్షణాలు, ముందు జాగ్ర త్తలు గురించి వివరించారు. తలసేమియా అనేది వంశపారం పర్యంగా వచ్చే రక్త రుగ్మతని, శరీ రంలో తగినంత హిమోగ్లోబిన్ ఉత్పత్తి ఉండదని తెలిపారు. వ్యాధి లక్షణాలను అనుసరించి, చికిత్స చేయాలని, శరీరంలో ఎర్ర రక్తకణాల సంఖ్యను పెంచడానికి 15 నుంచి 20 రోజులకు ఒక్క సారి రక్తం ఎక్కించడంతో పాటు ఎముకల మూలుగులో ఉన్న కణాలను మార్పిడి చేసి వ్యాధిని నివారించవచ్చునన్నారు. దీనినే వైద్య పరిభాషలో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ అంటారని తెలిపారు. తలసేమియా వ్యాధి కుటుంబ సభ్యులు జన్యుపరమైన పరీక్షలకు హాజరు కావటం అవసరమని, గర్భిణులు అవ్వాలనుకునేవారు తలసేమియా వ్యాధి సంబంధిత పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. భారత దేశంలో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు తలసేమియా వ్యాధి గురించి అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నారని న్నారు. అనంతరం వెలుగు సిబ్బంది చిన్నారు లకు పండ్లు, స్వీట్లను పంచిపెట్టారు. కార్యక్రమంలో వెలుగు ప్రత్యేక పాఠశాల వార్డెన్ స్వీటీ, స్పెషల్ ఎడ్యుకేటర్స్, చిన్నారులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మదనపల్లె మలేరియా సబ్ యూనిట్ అధికారి ఖలీల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరానగర్ సచివాలయం పరిధిలో ఫ్రైడే, డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆ ప్రాంత వాసులకు దోమల వ్యాప్తి వల్ల ప్రబలే వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమ తెరలు వాడాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా మురుగినీటి కాలవల్లో నీరు నిల్వ లేకుండా పారే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు వ్యాప్తికి అనుకూలమైన ముళ్ళకంపలు, పిచ్చి మొక్కలను తొలగించాలని వివరించారు. అనంతరం ఆ ప్రాంతంలో లార్వా ఆపరేషన్ చేపట్టి నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో దోమల నివారణకు మందులను పిచికారి చేశారు. కార్యక్రమంలో ఆ ప్రాంతం ఎఎన్‌ఎం, ఆశ కార్యకర్త, ప్రజలు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ అభివృద్ధికి కార్యాచరణ : కలెక్టర్



ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రముఖ హార్సిలీహిల్స్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శుక్రవారం బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్ పర్యాటక కేంద్రాన్ని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, అధికారులతో కలిసి కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా బెంగళూరు నుంచి అక్కడికి విచ్చేసిన ఒబెరాయ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అర్జున్ ఒబెరాయ్, ప్రెసిడెంట్ ఆర్.శంకర్‌తో కలిసి పర్యాటక అభివృద్ధిపై చర్చించారు. ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లతో ఐదు నక్షత్రాల హోటల్‌ను నిర్మించేందుకు ఒబెరాయ్ సంస్థ ముందుకు వచ్చిన విషయం విదితమే. కొండపై ఐదు నక్షత్రాల హోటల్ నిర్మాణానికి స్థల కేటాయింపు, నిర్మాణ అవకాశాలు, సాధ్యసాధ్యాలు తదితరాలను ఈ సందర్భంగా వారు చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌కు పర్యాటకంలో ఒక ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. ఇక్కడి పర్యాటక అభివృద్ధిపై ముఖ్యమంత్రి కూడా ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ రంగంలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఇక్కడ అన్ని రకాల వసతులు వారికి ఏర్పాటు చేస్తామని ఒబెరాయ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌తో కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చూపుతున్న చొరవ, సహకారం పట్ల వారు సంతృప్తి వ్యక్తపరిచారు. ఒబెరాయ్ సంస్థ బోర్డు సమావేశంలో చర్చించి ఇక్కడ నిర్మాణాలు ప్రారంభించాలనే ఆలోచనను వారు వ్యక్తం చేశారు.

విఎస్‌ఆర్ విండ్ వేవ్ హోటల్‌ను సీజ్ చేయాలని ఆదేశం

హార్సిలీహిల్స్ కొండపై ఉన్న గాలిబండ వద్ద ఉదయం, సాయంత్రం సమయాలలో అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణం కలిగి ఉంటుంది. హార్సిలీహిల్స్‌కు వచ్చే పర్యాటకులు అందరూ తప్పనిసరిగా గాలిబండ వద్దకు వెళ్లి సహజసిద్ధమైన ప్రకృతి అందాలను ,చక్కటి గాలిని ఆస్వాదిస్తూ అక్కడ ఎక్కువ సమయం గడుపుతుంటారు.అయితే గాలి బండకు పైభాగాన ఉన్న విఎస్‌ఆర్ విండ్ వేవ్ హోటల్ నుంచి వ్యర్థాలను, డ్రెయినేజీ నీరును బయటకు వదలడంతో అవి గాలిబండ సమీపంలో నిలుస్తున్నాయి. దీంతో అక్కడ పారిశుధ్యం లోపించి దుర్వాసనతోపాటు అపరిశుభ్రత నెలకొని పర్యాటకులకు ఇబ్బందికరంగా మారింది. ఈ విషయంలో హోటల్ యాజమాన్యం తీరు మార్చుకోకపోవడం వల్ల అనేక మంది నుంచి వచ్చిన ఫిర్యాదుల దృష్ట్యా హోటల్‌ను సీజ్ చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్, తహశీల్దార్లకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కొండపైన పారిశుధ్య కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, జిల్లా టూరిజం అధికారి నాగభూషణం, సర్వే శాఖ ఏడీ భరత్ కుమార్, తహశీలాదర్ మహమ్మద్ అజారుద్దీన్, పర్యాటక మేనేజర్ సాల్విన్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.600 వేతనం చెల్లించాలి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్



ఉపాధి కూలీలనుద్దేశించి మాట్లాడుతున్న వ్య.కా.స రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. శ్రీనివాసులు

ఉపాధి హామీ చట్టం కూలీలకు రూ. 600 వేతనం, 200 రోజుల పని దినాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కార్మిక వర్గం, రైతాంగం, దేశావ్యాప్తంగా చేపట్టిన ఈనెల 20 సార్వత్రిక సమ్మెలో ఉపాధి కార్మికులు పాల్గొని జయప్రదం చెయ్యాలని పిలుపునిచ్చారు. శుక్రవారం మదనపల్లి మండలం, పోతపోలు, భూమాకవారిపల్లి, నేతాజీ కాలనీ తదితర పని ప్రదేశాల్లో ఆయన పర్యటించి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యవసాయ పనులు తగ్గిపోతున్న నేపథ్యంలో రెక్కల కష్టమే ఆధారంగా జీవిస్తున్న కూలీలకు 100 రోజుల ఉపాధి పనులే దిక్కవుతున్నాయన్నారు. కూలీలందిరికి 100 రోజులు పనులు చూపించాలంటే కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.2.50 లక్షల కోట్లు నిధులు కేటాయించాలని, కానీ, కేవలం రూ.83 వేల కోట్లు (30శాతం) మాత్రమే కేటాయించిందని వాపోయారు. రాష్ట్రానికి వచ్చే అరకొర నిధులు పక్కదారి పట్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనిచేసిన రెండు వారాల్లోపు వేతనాలు ఇవ్వాల్సి ఉన్నా, 13 వారాలుగా వేతనాలు ఇవ్వడం లేదని, రోజువారి కూలి డబ్బులతో పూట గడిచే కూలీలకు 100 రోజులైనా వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతుకాలనీ ప్రశ్నించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ జీతాలు నెలకు రూ.50 వేలకు పైగా పెంచుకుని, ఉపాధి కూలీలకు మాత్రం కేవలం రూ.7 పెంచారన్నారు. పని ప్రదేశంలో కనీస వసతుల ఊసే లేదని, పనిముట్లు ఎనిమిదేళ్లుగా ఇవ్వకపోతే పనులు ఎలా చేయాలని ప్రశ్నించారు. గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి పెరగాలంటే ఉపాధి పనులు 200 రోజులు పెంచాలని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా రూ.600 వేతనం ఇస్తేనే జీవించగలరని ఆర్థికవేత్తలతో పాటు సుప్రీంకోర్టు సైతం చెప్పిందని గుర్తు చేశారు. వీటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాతరు చేయకపోవడం వల్లే ఈనెల 20న కార్మికులు తమ చట్టాలు, పని భద్రత కోసం దేశవ్యాప్త సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

జవాన్ సాహసాలు స్ఫూర్తిదాయకం

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

కాశ్మీర్ సరిహద్దుల్లో జవాన్ మురళీనాయిక్ ప్రదర్శించిన ధైర్య సాహసాలు దేశానికే కాక రాష్ట్ర ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ రక్షణలో భాగంగా జరిగిన పోరాటంలో రాష్ట్రానికి చెందిన వీరజవాన్ మురళీనాయక్ వీరమరణం పొందారని ఆయన ఆత్మకు శాంతి కలగాలని మంత్రి ఆకాంక్షించారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. దేశం కోసం ప్రాణాలర్పించిన యువ జవాన్ పేరు చరిత్రపుటల్లో చిరస్థాయిగా నిలిచి పోతుందని అన్నారు. దేశ రక్షణలో ఆయన చూపిన ధైర్యసాహసాలు, పోరాట పటిమకు యావత్ దేశం గర్విస్తోందన్నారు. జవాన్ల త్యాగాల వల్లే మనం సురక్షితంగా జీవించగలుగుతున్నామని మంత్రి పేర్కొన్నారు.

మామిడి రైతు కుదేలు!

ఓవైపు ప్రకృతి వైపరీత్యం.. మరో వైపు ధరలు లేకపోవడం..
వేధిస్తున్న తెగుళ్లు
ఈ ఏడాది అధిక నష్టం




గాలులకు రాలిన మామిడి కాయలు

ప్రజాశక్తి- చాపాడు

ఓ వైపు ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడే గాలులు, మరోవైపు మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో మామిడి రైతులు కుదేలవుతున్నారు. ఏటా నష్టపోతున్న తమకు ఈ ఏడాదైనా లాభాలు తెచ్చి పెడుతుందన్న ఆశలు అననుకూల వాతావరణంతో అడియాశలుగానే మారాయి. ఈ ఏడాది పూత తక్కువగా రావడం, ఈదురు గాలులకు పిందెలు, కాయలు రాలిపోతుండటంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి కడప జిల్లాలో అధికంగా రాయిచోటి , రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాలు మామిడి సాగుకు పెట్టింది పేరు. ప్రస్తుత కడప జిల్లాలో మైదుకూరు, దువ్వూరు, చాపాడు, కమలాపురం, వల్లూరు, బద్వేలు, అట్లూరు ప్రాంతాల్లో మామిడి పంట సాగులో ఉంది. తొలి విడతగా వచ్చిన మామిడి పూతలు జనవరిలో పిందెగా మారడంతో ఈ సీజన్ ఆశాజనకంగా ఉంటుందని రైతులు ఆనందపడ్డారు.

ఈ ఏడాది నష్టాలే...

ఈ ఏడాది మామిడి సాగు నష్టాలే. వర్షాలకు తోటల్లో కాయలు పూర్తిగా పాడైపోయాయి. వాతావరణం అసలు అనుకూలించలేదు. మందులు వాడినా పుచ్చులు ఎక్కువగా వచ్చాయి. ధరలు లేకపోవటం, దిగుబడులు లేకపోవటంతో పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చేలా లేవని రైతులు పేర్కొంటున్నారు. నాణ్యత కలిగిన కాయలు 20 శాతానికి మించి లేకపోవడంతో రైతులు కనిష్ఠ ధరలకు మాత్రమే పరిమితమవుతున్నారు.



జీవి సత్రం వద్ద సాగులో ఉన్న మామిడి తోట

వేధిస్తున్న అకాల వర్షాలు.. తెగుళ్లు

మార్చి ప్రారంభంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ 40 డిగ్రీల పైబడి నమోదయ్యాయి. ఉద్యానవన శాఖ అధికారులు వాతావరణ ఆధారిత పంటల బీమాపై కనీసం దష్టి పెట్టలేదు. ఫలితంగా రైతులు మార్కెట్లో ధర లేక మరో వైపు బీమా అమలు కాక నష్టపోతున్నామని మామిడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికంగా గాలులు వీస్తుండడంతో మామిడికాయలు అధికంగా రాలిపోతున్నాయి.

గాలులతో తీవ్రంగా నష్టపోయాం..

ఈఏడాది మామిడి సాగుతో తీవ్రంగా నష్టపోయాం. పూత దశ నుంచి గాలులు అధికంగా విస్తుండడంతో దిగుబడి పూర్తిగా తగ్గుముఖం పట్టింది. 8 ఎకరాలు మామిడి తోటను కౌలుకు తీసుకొని తీవ్రంగా నష్టపోయాం. ధరలు కూడా నామమాత్రంగా ఉన్నాయి. ప్రభుత్వం మామిడి సాగు చేపట్టిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

- మస్తానమ్మ, మామిడి రైతు, జివి సత్రం

దిగుబడి తగ్గి నష్టాలు మిగిలాయి..

మామిడి సాగు చేపట్టి ఈ ఏడాది నష్టాల పాలయ్యాం. మంచి దిగుబడులు ఉంటాయని కౌలుకు మామిడి తోటను కొనుగోలు చేస్తే సాగు గణనీయంగా తగ్గింది. ప్రారంభంలో పూత బాగున్నప్పటికీ గాలులతో దిగుబడి తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం ఉన్న కాయలు కూడా గాలికి తెగిపడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఐదు ఎకరాలలో మామిడి తోటను కౌలుకు తీసుకొని రూ. రెండు లక్షల వరకు నష్టాలపాలయ్యాను.

-వెంకటసుబ్బయ్య, కౌలు రైతు, మైదుకూరు.



ఫారంపాండ్ పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

ఫారంపాండ్ పనులు పరిశీలించిన పీడీ

ప్రజాశక్తి-రామాపురం

ఉపాధి పనుల్లో చేపట్టిన ఫారంపాండ్ కాలువల పూడిక పనులు ఈ నెల చివరి నాటికి పూర్తి చేయాలని డ్వామా పీడీ వెంకటరత్నం ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. మండలం లోని హసనాపురం పంచాయతీ చీకటివాండ్లపల్లి గ్రామంలో శుక్రవారం పర్యటించి ఉపాధి పనుల్లో చేపట్టిన రెండు పాండ్‌లు కాలువ పూడిక పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ కూలీలకు గిట్టుబాటు కూలీ రూ.307లు పడేవిధంగా పనులు కల్పించాలన్నారు. కూలీలను పెంచి మే నెల చివరి నాటికీ టార్గెట్ పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఎపిఒ పెంచలయ్య, టిఎ.చంద్రశేఖర్ ఫీల్డ్ అసిస్టెంట్లు మసూద్, రవిశంకర్‌రెడ్డి, పక్కిర్ రెడ్డి పాల్గొన్నారు.

శంకరయ్య సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-పుల్లంపేట

మంగంపేట మాజీ సర్పంచ్ చోడవరం శంకరయ్య సేవలు మరువలేనివని మంగం పేట టిడిపి కల్లా చలపతి, అనుమలగుండం చంద్రమోహన్, మాజీ వైస్ ఎంపిపి గునిపాటి చిన్నరాయుడు కొనియాడారు. దళిత నాయకులుగా కార్మికులు నాయకులు, ఎపిఎండిసి కార్మికుల, ఉద్యోగుల సమస్యలు పరిస్కారం కోసం ఎన్నో ఉద్యమాలను ముందుండి నడిపారని గుర్తు చేశారు. ఆయన వర్ధంతి సందర్భంగా తిరుపతి రుయా ఆసుపత్రి ప్రాంగణంలో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. చోడవరం శంకరయ్య వర్ధంతి సందర్భంగా వారి కుటుం బ సభ్యులు ఏర్పాటు చేసిన కార్యక్రమం లో పలువురు వైసిపి, టిడిపి, జనసేన, సిపిఐ, సిపిఎం, సిఐటియు, అధికారులు, ఉద్యోగులు, అభిమానులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ మేనేజరుగా రాము బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ మేనేజరుగా టి.రాము శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ముందుగా కమిషనర్ జీ.వి పల్లవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ నగర పంచా యతీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కమిషనర్, ఇతర సిబ్బందితో కలిసి సమన్వయంతో పని చేస్తానని ఆయన వెల్లడించారు. నూతన మేనేజరుకు నగర పంచాయతీ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.



గర్భిణులకు భోజనాన్ని వడ్డిస్తున్న ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి-వీరబల్లి

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిఎం ఎస్ఎంఎస్ కార్యక్రమంలో భాగంగా వైద్య సేవలకు కోసం వచ్చిన గర్భిణులకు ఎంపిపి గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా పౌష్టికాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాభావంతో చేస్తున్న కార్యక్రమాన్ని ఆదరించాలని సహాయ సహకారాలు అందించాలని కోరారు. గర్భిణులకు సేవ చేయడం మండల మొదటి పౌరుడిగా తన వంతు బాధ్యతగ చేస్తున్నానని అన్నారు. డాక్టర్ మనీషా మాట్లాడుతూ ఆస్పత్రిలో మంచినీటి సదుపాయం, కుర్చీలు వితరణ, గర్భిణులకు పౌష్టికాహారం అందించడంలో ఎంపిపి సహకారం అభినందనీ యమని అన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ సుధాకర్, సూపర్‌వైజర్లు యూడిసి సుజిత్ మండల నలుమూల నుంచి విచ్చేసిన గర్భిణులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని సాకిబండ యూనిట్, పటమటి కోన యూనిట్ పరిధిలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకట మోహన్ ఆధ్వర్యంలో నవధాన్యాలు ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్, సీడ్ పెలెటైజేషన్ విధానాన్ని ఉపయోగించి రైతుల పొలాల్లో 30 రకాల విత్తనాలను కృష్ణారెడ్డి, వెంకటలక్ష్మమ్మ, కె. వెంకట రమణ రైతుల పొలాల్లో నవధాన్యాలు విత్తారు. విత్తనాలను ముందుగానే విత్తన గుళికలు తయారు చేయడం వలన, తక్కువ వర్షపాతం ఉన్నా కూడా విత్తనాలు సమయానికి మొలకెత్తాయని అన్నారు. నేల నుంచి విత్తనం నుంచి వచ్చే తెగుళ్ల రావడం నివారిస్తుందన్నారు. నేలలో జీవవైవిధ్యం భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ పద్మావతి, రైతులకు సీడ్ పెలెటైజేషన్, ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ సాగు విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చలపతి నాయుడు, యూనిట్ ఇంచార్జ్‌లు రెడ్డి కళావతి, అరుణ, ఐసిఆర్‌పిలు కిరణ, వెంకట రామిరెడ్డి, రామంజులు, శివారెడ్డి, మౌనిక పాల్గొన్నారు.


12 నుంచి గాలీటమ్మ జాతర

ప్రజాశక్తి-గాలివీడు : స్థానిక పంచాయతీ పక్కిరరెడ్డిగారిపల్లి సమీపంలో వెలసిన గాలీటమ్మ జాతరను 12, 13 తేదీల్లో నిర్వహించడానికి ఏర్పాట్లు చురుగ్గా చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే దేవాలయం చుట్టూ రంగులతో అలంకరిం పజేశారు. ఆరవ తేదీన వీరబల్లి వాస్తవ్యులు గాలివీటి. విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యులు పట్టు వస్త్రాలు సమర్పించారు. సోమవారం రాత్రి ఉదయం 10 గంటలకు సిద్ధలు ,పూజలు కార్యక్రమం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి పూర్తి జాతర కార్యక్రమం దేవాలయం చుట్టూ చాందిని బండ్లు ప్రదర్శన, ఆర్కెస్ట్రా, 13న ఉదయం జ్యోతులు, బోనాలు సమర్పణ కార్యక్రమం నిర్వహించడానికి చర్యలు తీసుకున్నారు.

మదనపల్లి డివైఇఒకు సన్మానం

ప్రజాశక్తి-పీలేరు

మదనపల్లి డివైఇఒగా పీలేరు ఎంఇఒ వై.లోకేశ్వర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఉపాధ్యాయ సంఘాలు ఘనంగా సత్కరించాయి. స్థానిక మండల వనరుల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీలేరు మండల శాఖ యుటిఎఫ్ నాయకులు డివైఇఒను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ లోకేశ్వర్ రెడ్డి ఎంఇఒగా మండలంలో విద్యాసంస్థల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 పద్మావతి, యుటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శివారెడ్డి, మండల అధ్యక్షులు సుధాకర్, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, సభ్యులు మస్తాన్, భాస్కర్, మునిరెడ్డి, సురేష్, సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



డివైఇఒను సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు

దేశభక్తిని చాటుకుంటున్న బూర్లపల్లి కుటుంబం

- ఇద్దరు కొడుకులను దేశ రక్షణకు పంపిన తల్లిదండ్రులు
- మనోహన్ నాయుడు, కమలమ్మ దంపతులపై ప్రశంసలు



తల్లిదండ్రులతో సైనికులు హరికృష్ణనాయుడు, పురుషోత్తమ నాయుడు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

భారతదేశంపై బూర్లపల్లి కుటుంబం ప్రత్యేక మమకారం చాటుకుంటుంది.దేశ రక్షణ కోసం తన ఇద్దరు కుమారులైన బూర్లపల్లి హరికృష్ణనాయుడు, బూర్లపల్లి పురుషోత్తమ నాయుడును సైనికులుగా తీర్చిదిద్ది దేశరక్షణకు సరిహద్దులకు పంపారు. మండలంలోని బావగారుపల్లికి చెందిన మనోహర్ నాయుడు, కమలమ్మ దంపతులు గ్రామ ప్రజలు ప్రశంసించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశమంటే ప్రేమ ఒక్కటే ఉంటే చాలదని, బాధ్యత కూడా ఉండాలని భావించి మా బిడ్డలను దేశరక్షణ కోసం మిలిటరీ చేర్పించామని అన్నారు. వారు దేశం కోసం పోరాడుతుండడం గర్వంగా ఉందన్నారు. ఒక కొడుకును నీకు చేదోడువాదోడుగా ఉంచుకొని ఉంటే బాగుండేదని కొందరు సలహా ఇచ్చారని, నాకు చేదోడు వాదోడుగా ఉండి నాకు సహాయ పడే దానికన్నా దేశ రక్షణే తమకు ముఖ్యమని అన్నారు. కన్నపేగు ఒకరినన్న దగ్గర ఉంచుకోవాలని ఉన్నా కూడా దేశం కోసం నా బిడ్డలు వెళ్లడమే సంతోషాన్నిస్తోందని తెలిపారు. ఇద్దరు కుమారులను దేశ రక్షణ కోసం సైన్యంలో చేర్పించిన ఆ తల్లిదండ్రులను ప్రజలంతా అభినందిస్తున్నారు. పహల్గాంలో అమాయకులైన పర్యాటకులను పట్టణ ఉగ్రవాదులను కొంతమందించేందుకు భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ దిగ్విజయంగా జరుగుతోందన్నారు. భారత సైనికుల ధాటికి ఉగ్రవాదుల కోటలు బీటలు వారుతున్నాయని, శత్రుదేశం పాకిస్తాన్ వెన్నుల్లో వణుకు పడుతోందని పుడుతుందన్నారు. ప్రాణాలు పణంగా పెట్టి పోరాడుతున్న ప్రతి ఒక్క భారత సైనికుడికి సలాం చేస్తున్నామని అన్నారు. సైనికుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకొని పౌరులంతా బాధ్యతగా మెలగాలని కోరారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి పేర్కొన్నారు. శుక్రవారం నిమ్మనపల్లి పోలీసు స్టేషన్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. నూతన మోటార్ వాహన చట్టం నిబంధనలపై సూచిక బోర్డులతో, బ్యానర్ల సందేశంతో ద్విచక్ర వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు సంబంధించిన రికార్డులను వద్ద ఉంచుకోవాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు త్రిబుల్ రైడ్ చేయరాదని, మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. మైనర్లు వాహనాలు నడపడం నేరమని, కొత్త మోటర్ పాలసీ మేరకు మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆటోలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. నూతన మోటర్ వాహన చట్టం మేరకు నిబంధనలకు విరుద్ధంగా నడుచుకునే వాహనదారులపై కేసుల నమోదు తో భారీ మొత్తంలో చలానాలు కట్టవలసి వస్తుందని, పదే పదే పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్ సైతం రద్దు చేయబడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-రామాపురం

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐడిసిఎస్ సూపర్‌వైజర్లు పేర్కొన్నారు. శుక్రవారం ఐసిడిఎస్ సూపర్వైజర్లు హుస్సేనమ్మ, పద్మజారాణి, సుజాతరెడ్డి, సరస్వతిపల్లి, జిఎం కెఎస్ మౌనిక ఆధ్వర్యంలో రామాపురం సెక్టర్‌లోని హసనాపురం పంచాయతీ ఎరింగివాండ్లపల్లి అంగన్వాడీ కేంద్రం, సరస్వతిపల్లి గువ్వలచెరువు సెక్టార్ గోపగుడిపల్లి, చిట్లూరు సెక్టార్ చిట్లూరు దళితబవాడలో శుక్రవారం కిశోర బాలిక వికాసం కార్యమాన్ని చేపట్టారు. బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, పునర్వత్తి, ఆరోగ్యం అనే అంశాలపై 14 నుంచి 18 వయసు గల కిశోరబా లికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ గ్రామాలలో మూఢనమ్మకాలతో చిన్న వయసులోనే ఆడపిల్లలకు వివాహం చేస్తున్నారని అన్నారు. చిన్న వయసులో వివాహం చేయడంవల్ల రక్తహీనత గురై అనారోగ్య పాలవుతారని అన్నారు. గర్భిణి అయితే కాన్పు సమయంలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. గ్రామాలలో ఎక్కడైనా బాల్యవివాహాలు చేస్తున్నట్టు తెలిస్తే వెంటనే గ్రామ సచివాలయంలో మహిళా పోలీసులకు ఐసిడిఎస్ అధికారులకు సమాచా రాన్ని అందించాలన్నారు. బాలికలు ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళ పోలీస్ నగజ, ఎఎ న్ఎం హైమావతి, అంగన్వాడీ కార్యకర్తలు, మాధవి, ఝాన్సీ, శిరీష పాల్గొ న్నారు.

గాలివీడు : ఐసిడిఎస్ ప్రాజెక్ట్ లక్కిరెడ్డిపల్లి, గాలివీడు మండలం పందికుంట సెక్టార్, పందికుంట-1 జి పి పరిధిలో సూపర్వైజర్ వై.అరుణ కుమారి ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై వేసవి సెలవుల శిక్షణ తరగతి లో అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలు అనే అంశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూప్రస్తుత సమాజంలో కిశోర బాలికల సంక్షేమ, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కిషోరి వికాసం కార్యక్రమం అనీ, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం, బాల్య వివాహాలు చేసుకుంటే జరిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. కార్యక్ర మానికి సూపర్వైజర్ వై.అరుణకుమారి, అంగన్వాడీ వర్కర్స్ భూదేవి, రమాదేవి,శ్వేత, కిశోర బాలికలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



గాలివీడు : బాల్యవివావాహాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ సూపర్‌వైజర్లు

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



పుల్లంపేట : ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఎఒ శ్రీధర్

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని, ప్రతి విఒ లోని గ్రామస్థాయిలో జరుగుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని అందరూ కూడా ప్రోత్సహించాలని వెలుగు ఎపిఎం సుబ్బలక్ష్మి అన్నారు. మండల స్థాయి కన్వర్జెన్స్ ఎంఎఒ శ్రీకర్ ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న మహిళ రైతులకు తెలిపి ప్రతి సంఘం సమావేశంలో ప్రకృతి వ్యవసాయం గురించి అజెండాలో చర్చించి గ్రామస్థాయిలో పనిచేస్తున్నటు వంటి ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని వారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను తరచూ సమావేశాల్లో చర్చించుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి శేఖర్ మాట్లాడుతూ మండల కన్వెన్షన్ సమావేశం ముఖ్య ఉద్దేశాల గురించి వివరించారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లోకేశ్వర్‌రెడ్డి, బి.ప్రభాకర్, సునీతా దేవి, సుకుమార్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ:**ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపాలని మండల వ్యవసాయ అధికారిని లావణ్య పేర్కొన్నారు. స్థానిక మండల సమైఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై మండల స్థాయి సమావేశం కు హాజరయ్యారు.ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం లో ప్రీమాన్ సూన్ డ్రై సోయింగ్ లో 30 రకాల విత్తనాలు వేసుకోవాలన్నారు.ప్రకృతి వ్యవసాయంలో సార్వత్రిక సూత్రాలు, మహిళా సంఘాలు ఆచరించవలసిన సప్త సూత్రాలు,ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపిఎం పురుషోత్తం రెడ్డి, రైతు సాధికార సంస్థ యంగ్ ప్రొఫెషనల్ హరిప్రియ, మాస్టర్ ట్రైనర్ సుబ్బరామయ్య, విఎఎలు, ఎంఎస్ఒబిలు, విఒ విసి సభ్యులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండల పరిధిలోని కేశపురం, విఒ-1 హరిజనవాడ అంగన్వాడీ కేంద్రంలో జిల్లాప్రాజెక్టు మేనేజర్ వెంకట మోహన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం, ఆరోగ్య పోషకానికి గల సంబంధం, వాతావరణ మార్పులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వనరులతో పంటల సాగు గురించి వివరించారు. ఆరోగ్య పోషణ విభాగం నుంచి ఎన్ఎఫ్ఎఫ్ పావని గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, కిశోర బాలికలు, వృద్ధులకు సమతుల్య ఆహారం ప్రాముఖ్యతను తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి వేంపల్లి నూర్జహాన్

అభివృద్ధికి సహకరించండి : ఎంపిపి

ప్రజాశక్తి-కలికిరి

మండల అభివృద్ధికి నాయకులు, అధికారులు సహకరించాలని ఎంపిపి వేంపల్లి నూర్జహాన్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం నందు మండల సర్వసభ్య సమావేషం ఎంపిడిఒ భానుమూర్తిరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారిని మమతారెడ్డి మాట్లాడుతూ నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చినటువంటి రైతులు సంబంధిత రికార్డులు ఇచ్చి అన్నదాత సుఖీభవకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ మంజుల మాట్లాడుతూ మండలంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేస్తున్నటువంటి పనులు సవ్యంగా జరుగుతున్నాయని ఇంకా ఎవరైనా గడ్డి కోస దరఖాస్తు చేయదలిస్తే వారు సంబంధిత జిరాక్స్‌తో కార్యాలయంలో గానీ, ఫీల్డ్ అసిస్టెంట్ గాని చేర్చవలసిందిగా కోరారు. గృహ నిర్మాణ శాఖ ఎఇచంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా మంజూరు అయినటువంటి గృహాలకు గాను బిసి, ఎస్‌సిలకు అదనంగా రూ.50వేలు, ఎస్‌టిలకు రూ.75వేలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. అద్దె వారి పల్లి సర్పంచ్ గంగయ్య విద్యుత్ సమస్యలపై మండిపడ్డారు. గత సమావేశం లో కూడా జెఎల్ఎం మా గ్రామానికి లేరని ఎవరినైనా ఇన్‌ఛార్జిగా నియమించాలని కోరగా విద్యుత్ అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. విద్యాశాఖ అధికారి కరిముల్లా మాట్లాడుతూ ప్రభుత్వం బడిలో పిల్లలను చేర్చాలని దానికి సంబంధిత ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటిసిలు సహకరించాలని కోరారు. సమావేశానికి రోడ్డు రవాణా శాఖ, ఆర్ అండ్ బి శాఖ ఎక్సైజ్ శాఖ అధికారులు గైర్హాజరవడంతో ఎంపిపి మండిపడ్డారు. కార్యక్రమంలో సర్పంచులు రెడ్డివారి వెంకటరెడ్డి, గంగయ్య, గుండ్లూరు సర్పంచ్ సైపుల్ల, ఎంపిటిసిలు అల్లా బక్షు, రవి రెడ్డి, బాబు రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లు, ఈవో అశోక్ కుమార్, వైద్యాధికారి చిన్న రెడ్డప్ప, పశువైద్యాయకారి గిరిధర్ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు అరుంధతి, రెడ్డి సర్కాజ్, అటవీ శాఖ అధికారిని పాల్గొన్నారు.

నేడు భారత సైనికులకు మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి - నందలూరు

ఆపరేషన్ సిందూర్ మొదలు పెట్టిన సందర్భంగా మన దేశానికి , మన సైనికులకి మద్దతుగా శనివారం సాయంత్రం 4.30 గంటలకు అరవపల్లి కృష్ణ మందిరం దగ్గర నుంచి అంబేద్కర్ సర్కిల్ బస్టాండ్ వరకు మన దేశ జెండాలతో ర్యాలీ నిర్వహించనున్నట్లు నాగిరెడ్డి పల్లె మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం అరవపల్లెలోని శ్రీకృష్ణ గీతా మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కులమతాలు, పార్టీలకు అతీతంగా సైనికులకు మద్దతుగా వచ్చి మన దేశానికి దేశ సైనికులకి జేజేలు పలకాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ కార్యదర్శి సయ్యద్ అమీర్, అమ్మవారి శాల ఆలయ అధ్యక్షులు ఎంబలూరు నరసింహ, మోడపోతుల రాము, ముమ్మడిశెట్టి రమేష్, ఉప్పుశెట్టి సుధీర్, గంధం గంగాధర్, నారపు శెట్టి శివయ్య, సురేష్, సుబ్బ నరసయ్య, గురువి గారి వాసు, కొట్టే శ్రీహరి,ఆదినారాయణ, వైసిపి నాయకులు బూసి రెడ్డి రాజశేఖర్ రెడ్డి, కాకి చంద్ర పాల్గొన్నారు.



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ

నెలాఖరులోగా గృహనిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణాలు ఈనెల ఆఖరికి త్వరగా పూర్తిచేయాలని ఎంపిడిఒ నూర్జహాన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బొంగావాండ్లపల్లి, తొట్టి కాడ హరిజ నవాడ, కేయంపల్లి, వీరబల్లి టౌన్, గుడ్డిండ్లవాండ్లపల్లి, ఎన్టీఆర్ పథకంలో మంజూరైన గృహాలను హౌసింగ్ ఎఇ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, ఎస్ఐ సురేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉదయ్ కుమార్‌తో కలిసి పూర్తికాని ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ పథకం కింద మంజూరైన గృహాలను ఈనెల ఆఖరిలోగా పూర్తిచేయాలని ప్రజలకు తెలిపారు. లేనిపక్షంలో ఇళ్లకు బిల్లులు మంజూరు కావదని, లబ్దిదారులు త్వరపడి పూర్తిచేయాలని ప్రజలను కోరారు. ఆమె వెంట హౌసింగ్ ఎఇ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉదయ్‌కుమార్, ప్రజలు పాల్గొన్నారు.

పాలకమండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ : ఇఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని తవళం గ్రామం అటవీ ప్రాంతంలో వెలసిన స్వయంభుడు శ్రీ యోగ నేలమల్లేశ్వరస్వామి ఆలయ పాలకమండలి ఏర్పాటుకు రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ నోటిఫికేషన్ విడుదల చేశారని ఆలయ ఇఒ మంజుల పేర్కొన్నారు. మండలంలో ప్రసిద్ధిగాంచిన, ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీ యోగ నేలమల్లేశ్వరస్వామి ఆలయానికి సుమారు ఐదు సంవత్సరాలకు పైగా పాలకమండలి లేకపోవడంతో ఆలయ సంరక్షణ, పర్యవేక్షణ కొరవడింది. రెండు సంవత్సరాల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఆలయ పాలకమండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేసినా అనేక కారణాలతో దేవాదాయ శాఖ అధికారులు పాలక మండలిని ఏర్పాటు చేయలేకపోయారు. ప్రస్తుతం రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడడంతో దేవాలయాల అభివృద్ధి, సంరక్షణ, పర్యవేక్షణ పై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుని ఆలయాల పాలకమండలిని ఏర్పాటు చేయడానికి ఉత్తర్వులను జారీ చేసింది. ఆలయ ఇఒ మంజుల మాట్లాడుతూ నేలమల్లేశ్వర స్వామి ఆలయ పాలకమండలి ఏర్పాటుకు దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులను జారీ చేశారని అన్నారు. ఆ మేరకు ఆసక్తి కలిగిన, ఆలయ అభివృద్ధిని ఆకాంక్షించే వారు ఈనెల 25వ తేదీలోగా తమ దరఖాస్తు ఫారాలను అన్నమయ్య జిల్లా దేవాదాయ శాఖ అధికారికి సమర్పించాలని ఇఒ తెలిపారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న కెవికె కో-ఆర్డినేటర్ మంజుల

సేంద్రియ పద్ధతులతో చీడపీడల నివారణ

ప్రజాశక్తి-కలికిరి

జిల్లాలో కొబ్బరి పంటకు ఆదరణ పెరుగుతోందని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల అన్నారు. ఇది వివిధ రకాల నేలలలో ఏపుగా పెరుగుతుందని చాలా మంది రైతులు మూడు ఎకరాలు, మించి సాగు చేయడం ఆరంభించారని తెలిపారు. కొన్ని సాంప్రదాయ రకాలు హైబ్రిడ్ పొట్టి రకాలు పెంచుకోవచ్చునని, కొన్ని రకాల చీడలు, పీడలు కొబ్బరిని ఆశించి నష్టం చేకూరుస్తున్నాయని వీటిని వివిధ సేంద్రియ పద్ధతులతో అదుపులో ఉంచవచ్చునని అన్నారు. సంవత్సరం పొడవునా తోటలను శుభ్రంగా ఉంచాలని కలుపు ఎప్పటికప్పుడు నివారిస్తే నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవడం, పచ్చి రొట్టి పైరులైన జనుము పిల్లి పెసర, ఉలవ పంటలను పెంచాలని, ఎండిన మట్లను, పురుగు పట్టి ఎండిపోయిన చెట్లను తీసివేసి ఒకపక్కగా వేసి నాశనం చేయాలన్నారు. కొమ్ము పురుగుకు లింగాకర్షకు బుట్టలను అమర్చి ఆకర్షింపబడిన పురుగులను చంపేయాలన్నారు. జిల్లాలో విరివిగా పశుసంపద ఉన్నది కాబట్టి బాగా చివికిన పశువులు ఎరువును చెట్ల మొదళ్ళకు వేప చెక్కతో గానీ, కానుగ చెక్కతో గానీ కలిపి చెట్ల పాదులలో వేసి మట్టిలో కలపాలని, పశువుల ఎరువులో వేరుపురుగు, కొమ్ము పురుగు గొంగళి పురుగు దశలను ఏరి నీళ్ల టబ్ లో వేసి చంపి, వాటిని కోళ్లకు మేతగా గాని, కంపోస్ట్ తొట్లలో గాని వేయాలని సూచించారు. పొడవాటి ఇనుప కడ్డీతో మొవ్వులో నుంచి ముక్కుపురుగును లాగి నాశనం చేయవచ్చన్నారు. కొబ్బరి తోటను వేప సంబంధిత మందు లతో నెలకు ఒకసారి పిచికారి చేస్తే కాయ నల్లి, రూగోస్ వైట్ ఫ్లై, ఆకు ఎండు తెగులు, స్టెమ్ బ్లీడింగ్ లాంటి సమస్యలను అధిగమించవచ్చని సూచించారు. వర్షాలు విరివిగా పడినప్పుడు కాయ నల్లి, రూగోస్ ఫ్లై ప్రకృతి సిద్ధంగానే అదుపులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో కె వి కే శాస్త్రవేత్తలు, కొబ్బరి తోట రైతులు పాల్గొన్నారు

50 శాతం రాయితీతో పశుదాణా

ప్రజాశక్తి-చిన్నమండెం

చిన్నమండెం మండల పరిధిలోని 13 గ్రామాల రైతులకు 50 శాతం రాయితీతో 20శాతం ప్రోటీన్ గల దాణాను శుక్రవారం పశుపోషకులకు పశువైద్యశాలలోపంపిణీ చేశారు. రూ.1100 రూపాయలు విలువగల దాణాను రూ.555కే ప్రభుత్వం తరపున అందించారు. తెల్ల రేషన్ కార్డు గల పశు పోషకుల కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి గరిష్టంగా 450 కేజీల దాణా ఇవ్వడం జరుగుతుందని పశువైద్యాధికారి గణేష్ తెలియజేశారు ఈ దానాను రైతు సేవకేంద్రాల ద్వారా గాని పశువైద్యశాలలో పొందవచ్చని తెలిపారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి : బివైఎస్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో పలుచోట్ల గుంతలు, గతుకులతో పాడై ప్రమాదకరంగా మారిన రోడ్లను వెంటనే మరమ్మతులు చేపట్టాలని బహుజన యువసేన నాయకులు పేర్కొన్నారు. ప్రజలను ప్రమాదాల బారి నుంచి కాపాడాలని శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎఒకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బివైఎస్ రాష్ట్ర అధ్యక్షులు పునీత్ మాట్లాడుతూ మదనపల్లిలో కోమటివాని చెరువు కట్టమీద నిర్మించిన రోడ్డుమీద ఎక్కువ శాతం విద్యార్థులు, చిన్నపిల్లలు, వృద్ధులు ప్రయాణిస్తూ నడుస్తూ ఉంటారని, అలాంటి రోడ్డు అంతా గుంతలమయమై పోయిందన్నారు. రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన సేఫ్టీ ఇనుప రాడ్లు పాడైపోయి చెరువులోకి పడిపోయాయని, దీనివల్ల ప్రమాదవశాత్తు అదుపు తప్పితే ఒకపక్క చెరువు, మరోపక్క మెయిన్ రోడ్డు ఉన్న కారణంగా పడితే ఏకంగా ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొందన్నారు. గుంతలు ఎక్కువ అవ్వడంతో వాటిని తప్పించే క్రమంలో వాహనదారులు నడుచుకొని వెళ్లే వారిమీదకు దూసుకొస్తున్నారని, తద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్డును మరమ్మత్తులు చేయించి ప్రమాదాల నుంచి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో బివైఎస్ నాయకులు హరికృష్ణ, శ్రీనివాసులు, బాలకృష్ణ, వినయ్, తారక్, ఉదయ్, గౌతమ్, త్రిలోక్, సతీష్ పాల్గొన్నారు.



గుంతల మయమైన రోడ్ల చిత్రాలను చూపుతున్న బివైఎస్ నాయకులు